క్లుప్తంగా

నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న డీఈ వేణుగోపాల్

లింగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నమూనా ఇంటి నిర్మాణం కోసం మంగళవారం మండల కేంద్రంలోని ధరణి కార్యాలయం ఆవరణలో మండలాధికారులతో కలిసి హౌజింగ్ శాఖ డీఈ వేణుగోపాల్ భూమిపూజ చేశారు. డీఈ వేణుగోపాల్ మాట్లాడుతూ మండలానికి ఒక్క నమూనా ఇంటి నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో రామచందర్, ఎంపీవో రజనీకాంత్, కారోబారి మంగులాల్ రవి, విజేశ్ పాల్గొన్నారు.

జాతరకు ఆలయం ముస్తాబు



ముస్తాబైన ఆలయం

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామంలో బుధవారం జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బండ రమేశ్ తెలిపారు. శ్రీలక్ష్మి వేంకటేశ్వర సహిత సద్గురు సాయినాథ్ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం పల్లకి సేవా, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జాతర నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'టాలెంట్ టెస్టు' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న టీకానంద్

తిర్యాణి: పదవ తరగతి విద్యార్థులు ఈనెల 16న ఎస్ఎఫ్ఐ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్టును విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో పదవ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న తహసీల్దార్ మునావర్ షరీఫ్

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్ 18మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ దౌలత్, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, ఆర్ఐ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

'నాసిరకం ఆహార పదార్థాలతో అనారోగ్యం'

వాంకిడి: బేకరీలు, కిరాణాల్లో విక్రయించే నాసిరకం, కాలం చెల్లిన ఆహార పదార్థాలతో గ్రామీణ ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారని సీపీఎం(ఎంఎల్) రెడ్‌స్టార్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగర్ల తిరుపతి ఆరోపించారు. వాంకిడి మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించే వారసంతకు వచ్చే గ్రామీణులకు బేకరీలు, దుకాణాల యజమానులు నాసిరకం సరుకులు విక్రయిస్తున్నారని అన్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకుడు రాజేశ్ ఉన్నారు.

'అర్చకులు రంగరాజన్‌పై దాడి అమానుషం'

ఆసిఫాబాద్‌అర్బన్: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని, దాడిని ఆసిఫాబాద్ డీడీఎస్ జిల్లా సంఘం తీవ్రంగా ఖండిస్తుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ శర్మ, అధ్యక్షుడు ఒజ్జల శిరీష శర్మలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన అర్చకుడిపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్మార్ట్‌గా బంధిస్తోంది..!

ఈ ఆధునిక కాలంలో ప్రతీ ఒక్కరు నిద్రపోయేటప్పుడు ముట్టుకునే చివరి వస్తువు.. నిద్ర లేవగానే పట్టుకునే తొలి వస్తువు సెల్‌ఫోన్. స్మార్ట్‌ఫోన్ల వాడకం పతాకస్థాయికి చేరింది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌కు అనుసంధానమైపోయారు. దీంతో ఎన్ని ప్రయోజనాలున్నాయో.. అంతకుమించి అనర్థాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రమేణ మొబైల్ అడిక్షన్ వదిలించుకోవడానికి ఆసుపత్రుల చుట్టూ తిరిగే వారి సంఖ్య పెరుగుతుంది. పిల్లలను సెల్‌ఫోన్ల బారి నుంచి కాపాడడానికి తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతున్నారు. అపరిమిత వాడకం.. జీవితాలనే చిన్నాభిన్నం చేస్తోంది. తల్లి తనకు సెల్‌ఫోన్ ఇవ్వలేదని 16 ఏళ్ల బాలిక కౌటాలలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇటీవల చోటుచేసుకుంది.

– కౌటాల

- మితిమీరిన స్మార్ట్‌ఫోన్ల వినియోగం
- కెరీర్‌కు ప్రతిబంధకంగా మారిన వైనం
- అతివాడకంతో అనారోగ్యం
- ఇటీవల సెల్‌ఫోన్ ఇవ్వలేదని బాలిక ఆత్మహత్య



చిన్నప్పటి నుంచే వాడకం..

అన్నం తినకుండా మారం చేస్తున్నారనో.. పిల్లలు అల్లరి ఆపడం కోసం చాలా మంది తల్లిదండ్రులు పిల్లల చేతికి సెల్‌ఫోన్ ఇస్తుంటారు. ప్రారంభంలో ఇది సరదాగా అనిపించినా.. క్రమేపీ అదొక వ్యసనంలా మారుతోంది. దీంతో రోజులో ఎక్కువ సమయం వారు సెల్‌ఫోన్‌తో గడుపుతున్నారు. దీంతో వారు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే సెల్‌ఫోన్ ఇవ్వకుంటే ఆత్మహత్యకు పాల్పడడానికి కూడా వెనుకాడడం లేదు. సెల్‌ఫోన్ అతి వినియోగంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటీవల కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఓ బాలుడు అతిగా సెల్‌ఫోన్ వినియోగించడంతో చేతులకు నరాల బలహీనత రావడంతో ఆస్పత్రిలో చికిత్స అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెల్‌ఫోన్ల వినియోగంతో చిన్న వయసులోనే కంటి సమస్యలు వచ్చి కళ్లద్దాలు వినియోగించే పరిస్థితి నెలకొంటుంది.

బానిసగా మారుతున్న యువత..

ప్రతి ఒక్కరి జీవితంలో సెల్‌ఫోన్ ఒక భాగమైంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్ ఫోన్ల వాడకం ప్రస్తుతం అధికమైంది. రకరకాల యాప్స్‌తో నిత్యం వాటిపైనే కాలక్షేపం చేస్తున్నారు. వాట్సాప్, యూ ట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలలో కాలక్రమేణ అసభ్యకరమైన చిత్రాలు, వీడియోలు ప్రత్యక్షమవుతున్నాయి. తల్లిదండ్రులకు తెలియకుండానే పిల్లలు వీటికి బానిసలుగా మారిపోతున్నారు. పలు రకాల యాప్స్‌లో గేమ్స్ ఆడి డబ్బులు నష్టపోతున్నారు. ఇటీవల కౌటాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడి సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు అసభ్యకరమైన చిత్రాలు పంపి డబ్బులు పంపించాలని ఒత్తిడికి గురి చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అతి గారాబంగా పెంచకుండా సమాజహితానికి ఉపయోగపడే విషయాలు నేర్చుకునేలా తీర్చిదిద్దాలి.

ఆరోగ్య సమస్యలు..

జిల్లాలో దాదాపు నాలుగు లక్షలకు పైగా మంది సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగిస్తున్న వారికి సగటున రోజుకు రెండు గంటల సమయం వృథా అవుతోంది. ఎక్కువగా యువత, పనిచేసే వారు సెల్‌ఫోన్ల వినియోగంతో కాలక్షేపం చేస్తున్నారు. దీంతో ఉత్పాదక రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. చాలా మంది విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోతున్నారు. ఎక్కువ సేపు మెడ వంచి మొబైల్ ఫోన్ మెసేజీలు చదువుతున్నారు. సెల్‌ఫోన్ వాడకంతో వెన్నముక, కంటి సమస్యలు వస్తున్నాయి.

అనర్థాలకు మూలం సెల్‌ఫోన్



అనేక అనర్థాలకు సెల్‌ఫోన్ వినియోగమే మూలం. ప్రపంచ ఆరోగ్య సంస్థ సెల్‌ఫోన్, వాట్సాప్, ఇంటర్‌నెట్ వినియోగాన్ని కూడా ఒక బానిసత్వంగా పరిగణించింది. సెల్‌ఫోన్‌తో నిద్ర వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటోంది. ధ్యాస లోపించడంతో పాటు మెడ నొప్పులు, కంటి చూపు పూర్తిగా మందగిస్తోంది. చిన్న వయస్సులో నిషేధిత వెబ్‌సైట్లలోకి ప్రవేశించి చెడు వ్యసనాలకు బానిసలుగా మారిపోతున్నారు.

– డాక్టర్ నవత, డీడీవో

పిల్లలను కనిపెడుతూ ఉండాలి



ప్రధానంగా విద్యార్థులు, యువత సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి వాటికి బానిసలుగా మారిపోతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం ఒక కంట కనిపెడుతూ ఉండాలి. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియాలో ఉంటున్న వాళ్లు కాస్త జాగ్రత్తగా ఉండాలి. సైబర్ ఉచ్చులో పడితే తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా పోలీస్‌స్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలి.

– ఎస్. మధుకర్, ఎస్సై

కుష్ఠు లక్షణాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న హెచ్ఈవో రవిదాస్

వాంకిడి: కుష్ఠు వ్యాధి లక్షణాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ అన్నారు. మంగళవారం వాంకిడి మండలంలోని ఖిరిడి, ఖమాన గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై రాగి, గోధుమ రంగులో మచ్చలు ఉండి, స్పర్శ లేకుంటే వెంటనే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. మొదట్లోనే వ్యాధిని గుర్తిస్తే మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా ఆరు నెలల్లో నయం చేయవచ్చని, శరీరంపై ఆరు కంటే ఎక్కువ మచ్చలు ఏర్పడితే 12 నెలల పాటు మాత్రలు వాడాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కుష్ఠుపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్ఎం కృష్ణ కుమారి, ఆశ లక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతరలో అరకొర సౌకర్యాలు



సైడ్‌వాల్స్ లేని టెంట్ కింద వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

రెబ్బెన: ప్రసిద్ధ గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. జాతరలో భక్తులు అనారోగ్యానికి గురైతే తక్షణమే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్యశిబిరాలను వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసింది. అయితే టెంట్ వేసి ఎలాంటి సైడ్‌వాల్స్ లేకుండా వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో భక్తులు ఖంగుతిన్నారు. అనారోగ్యం పాలైన వారికి ఇంజక్షన్ వేయాలంటే కనీసం చాటు ఉండేలా ఎలాంటి ఏర్పాటు చేయలేదు. ఖాళీ టెంటు కిందే రెండు బెడ్లు, మందులు అందుబాటులో ఉంచుకుని వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. మహిళలు అనారోగ్యానికి గురైతే చాటు లేకుండానే ఇంజక్షన్ వేసి వైద్య సేవలు అందిస్తారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

టెంట్‌కు కూడా నోచుకోని అగ్నిమాపక సిబ్బంది..

మూడు రోజుల గంగాపూర్ జాతరలో భాగంగా జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బంది రాత్రిపగలు అని తేడా లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. జాతరలో ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా అగ్ని మాపక వాహనాన్ని అందుబాటులో ఉంచారు. అయితే అగ్ని మాపక సిబ్బందికి కనీసం టెంట్ సౌకర్యం కూడ కల్పించకపోవడంతో సిబ్బంది ఎండలోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఎండల తీవ్రత తట్టుకోలేక పక్కన వైద్య శిబిరం కోసం ఏర్పాటు చేసిన టెంట్‌లో అగ్నిమాపక సిబ్బంది కాసేపు కూర్చుని సేదతీరుతున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న కోనేరు కోనప్ప

పెంచికల్‌పేట్: యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని అగర్‌గూడ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొని విన్నర్ గొంట్లపేట్, రన్నరప్ అగర్‌గూడ జట్టుకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు ఆటల్లో రాణించాలన్నా రు. మాజీ సర్పంచులు శ్రీనివాస్, సంజీవ్, సుధాకర్, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సాజిద్, నాయకులు చౌదరి తిరుపతి, మారయ్య, ఎస్కే బాబు, బండన్న, వెంకటేశ్, మల్లేశ్, చలం, లచ్చన్న, రమేశ్, సకరాం, శ్రీనివాస్, కొండయ్య, రాకేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో మ్యాన్‌పవర్ సమస్య పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో నెలకొన్న మ్యాన్ పవర్ కొరత సమస్యను పరిష్కరించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి అన్నారు. మంగళవారం సీహెచ్‌పీలో ఎస్ఈ కోటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీహెచ్‌పీలో తగినంత మ్యాన్‌పవర్ లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నెలనెలా కార్మికులు విరమణ చేస్తున్నారని, వారి స్థానంలో కొత్త వారి నియామకం లేకపోవటంతో పని చేస్తున్న కార్మికులపై పనిభారం పెరుగుతోందని దాంతో కార్మికులకు పని ఒత్తిడికి గురై అనారోగ్యాల పాలవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకుని మ్యాన్ పవర్ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఈ సందర్భంగా మెకానికల్ ఫోర్‌మెన్ రాజేశ్, క్వాలిటీ విభాగంలో పని చేస్తున్న కార్మికులు సారయ్యలు ఏఐటీయూసీ పోరాటాలకు ఆకర్షితులై యూనియన్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.ఆనంద్, ఫిట్ కార్యదర్శి ఎంబడి రామయ్య, సహాయ కార్యదర్శి ఎల్తూరి శ్రీనివాస్, నాయకులు షమీ, సురేశ్‌కోరి, గజ్జల రాజయ్య, శ్రీపాల్, అమర్‌సింగ్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో నెలకొన్న సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్వేయర్ ఆపరేటర్ డిసిగ్నేషన్ ఉన్న వారితో ప్రీవేబిన్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్న వారికి ప్రీ వేబిన్ ఆపరేటర్‌గా పదోన్నతులు కల్పించాలని అన్నారు. ఏరియాలో 20 సంవత్సరాలుగా పని చేస్తున్న ఎలక్ట్రీషియన్, ఫిట్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి వారు కోరుకున్న ఏరియాకు బదిలీ చేయాలన్నారు. ఈపీ ఆపరేటర్లకు ఖాళీలతో సంబంధం లేకుండా టైం బాండ్‌తో పదోన్నతులు కల్పించాలన్నారు. బెల్లంపల్లి పట్టణంలో ఉన్న సింగరేణి క్వాటర్లను ఈ ఏరియాలో పని చేస్తున్న కార్మికులకు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబేద్కర్, రామారావులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



కౌటాల: జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

లింగాపూర్: ఎలక్షన్ కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల వారీగా డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితాను మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో విడుదల చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంతో పాటు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులపై జాబితా ప్రచురించినట్లు ఎంపీడీవో రామచందర్ తెలిపారు. ఎంపీవో రజనీ కాంత్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీవో కోట ప్రసాద్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది దీపక్, సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆపన్న హస్తం



చందు కుటుంబ సభ్యులతో మిత్ర బృందం

వాంకిడి: కలిసి చదువుకున్న మిత్రుడు అకాల మరణం పొందగా అతని కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన సెల్వట్‌కార్ చందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1992 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు రూ.20 వేలు జమ చేసి మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా చందు చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి మౌనం పాటించారు. దుర్గం ఇస్తారి, తిరుపతి, పుష్ప, జమున, మాయ, లీల, మెంగాజీ, ప్రవీణ్, హన్మంతు తదితరులు ఉన్నారు.

దారి కష్టాలు..!

- రోడ్డు సౌకర్యం లేక ఆదివాసీల తిప్పలు
- పట్టించుకోని అధికారులు



కొలాంగూడకు వెళ్లే మట్టిరోడ్డు

కెరమెరి: గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ గ్రామీణ గిరిజన రోడ్లు రవాణా సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ప్రజలు అడిగినప్పుడల్లా అరకొర నిధులు విడుదల చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రజల కష్టాలు తీరడం లేదు. మండలంలోని ఆగుర్‌వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ, నాగల్‌గొంది గ్రామాలకు రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో 105 కుటుంబాలు ఉండగా సుమారు 300 జనాభా ఉంది. కాగా వారు ప్రతినిత్యం వివిధ అవసరాల నిమిత్తం కెరమెరి, ఆసిఫాబాద్ కేంద్రాలకు వెళ్తుంటారు.

తారురోడ్లు కరువు..

రోడ్డు సౌకర్యం లేక ఆదివాసీల తంటాలు అంతా ఇంతా కాదు. సుమారు 45 ఏళ్ల చరిత్ర కలిగిన గ్రామాలకు నేటికీ తారు రోడ్డు లేదంటే అతిశయోక్తి కాదు. గతంలో అధికారులకు పలుమార్లు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని అర్జీలు సమర్పించగా కంటి తుడుపు చర్యగా 2019లో మట్టి రోడ్డు వేశారు. కాని అది కూడా తాత్కాలిక రోడ్డుగా మారింది. భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో నిత్యం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా వానాకాలంలో రెండు గ్రామాలకు వెళ్లాలంటే వాగులు ఆటంకంగా మారాయి. రోడ్డు కూడా అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆగుర్‌వాడ గ్రామం నుంచి సుమారు 4 కిలోమీటర్లు నాగల్‌గొంది వరకు పూర్తిగా కచ్చా రోడ్డు ఉంది. మరోసారి వేసే రోడ్డు మట్టితో కాకుండా సిమెంట్ రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన రోడ్డు

అధికారులు స్పందించాలి



చాలా కాలంగా సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవిస్తున్నాం. ఈ సారి మట్టి రోడ్డు కాకుండా సీసీరోడ్డు వేయాలి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. పంచాయతీ నుంచి నిర్మించాలంటే నిధులు సరిపోవడం లేదు. దీంతో ప్రత్యేక నిధులతో రోడ్లు, కల్వర్టుల నిర్మాణం చేపట్టాలి.

– మధుకర్, మాజీ సర్పంచ్, ఆగుర్‌వాడ

'ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి'

నార్నూర్: ఉపాధిహామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో సురేశ్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నిర్మిస్తున్న కోళ్ల ఫారం షెడ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు మట్టి రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, కాలువలు, నాళాలపై చెక్ డ్యామ్ నిర్మాణాలు, కోళ్ల ఫారం, పశువుల పాక, ఆర్ఓఎఫ్ఆర్ భూమిలో చెదలు చేయడంతో పాటు వివిధ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల రైతులు పనుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. టీఏ జాదవ్, మోహన్ కుర్సెంగా ఉన్నారు.

ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు



అవగాహన కార్యక్రమంలో డీఈవో, విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని డీఈవో గమానియల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు టీశాట్ అవగాహన కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. డీఈవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి.. అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా టీశాట్ ద్వారా విద్యాశాఖ నిపుణులు విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తూ సలహాలు, సూచనలు ఇచ్చారని తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సెల్‌ఫోన్, టీవీకి దూరంగా ఉండాలన్నారు. నిర్భయంగా పరీక్షలకు సన్నద్ధమయ్యేలా ప్రేరణ కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, దేవాజీ, హెచ్ఎం ఉదయ్‌బాబు పాల్గొన్నారు.

కుష్ఠుపై అపోహలు వీడాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాగర్

నార్నూర్: ప్రజలు కుష్ఠు వ్యాధిపై అపోహలు వీడాలని డీఎస్ఎంవో డాక్టర్ సాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపల్లి గ్రామంలో స్పర్శ్ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెన్‌లో భాగంగా కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ శరీరంపై పాలిపోయిన రాగి రంగు, మొద్దు బారిన మచ్చలు, కాళ్ల చేతుల్లో తిమ్మిర్లు రావడం లక్షణాలన్నారు. వ్యాధికి ఆధునిక చికిత్స అన్ని ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నార్నూర్ రాంబాబు, డీపీఎమ్‌వోలు వామన్ రావు, రమేశ్, సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్ ఉన్నారు.